రసాభాసగా సర్వసభ్య సమావేశం

- సభలో సమస్యలను ఏకరువు పెట్టిన సభ్యులు
- బిల్లులు రావడంలేదని సర్పంచుల ఆరోపణలు
- ఉత్సవ విగ్రహాలమేనని ఎంపీటీసీ భాగ్యలక్ష్మి ఆవేదన
- హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్


మండల సభలో మాట్లాడుతున్న కన్నాపూర్ ఎంపీటీసీ భాగ్యలక్ష్మి

శంకరపట్నం: శంకరపట్నం మండల సర్వసభ్య సమావేశం రసాభాసాగా సాగింది. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఎంపీపీ ఉమ్మెంతల సరోజన అధ్యక్షతన సభ నిర్వహించారు. సమావేశంలో సభ్యులు సమస్యలను ఏకరువు పెట్టారు. సీసీరోడ్లు వేసి ఏళ్లు గడుస్తున్నా బిల్లులు రావడం లేదని, అప్‌లోడ్ చేయొద్దని ఆపరేటర్‌లకు చెప్పారా అని ఏఈ తిరుపతిని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సంజీవారెడ్డి ప్రశ్నించారు. వైకుంఠధామాలు నిర్మించినా బిల్లులు రావడంలేదని సర్పంచులు కిషన్‌రావు, అనిత, నాలుగేళ్లు గడిచినా రేషన్ కార్డులు ఏవని సర్పంచులు రజిత, రేణుకా, విద్యుత్ చార్జీలు వసూళ్లు చేస్తున్న ట్రాన్స్‌కో అధికారులు, కాచాపూర్ సబ్‌స్టేషన్ పన్నులు చెల్లించాలని నోటీసులు ఇచ్చినా స్పందించడం లేదని, తాళం వేస్తానని సర్పంచ్ రాజయ్య అన్నారు. ట్రాక్టర్ డీజిల్ బిల్లులు రావడం లేదని చెత్త సేకరణ, మొక్కలకు నీళ్లు పోసేందుకు ఇబ్బందులు పడుతున్నామని గద్దపాక సర్పంచ్ మండిపడ్డారు. కేశవపట్నంలో రోడ్డు ఇరుకుగా ఉందని రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని రోడ్డు వెడల్పు చేయాలని ఎంపీటీసీ తిరుపతి డిమాండ్ చేశారు. సమావేశానికి హాజరుకాని ఎస్సారెస్పీ అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామంలో నాటిన చోటనే మొక్కలు నాటుతున్నారని నిధులు వృథా అవుతున్నాయని కన్నాపూర్ ఎంపీటీసీ భాగ్యలక్ష్మి ఆరోపించారు. గ్రామ పంచాయతీల్లో జరిగే సమావేశంలో మాట్లాడవద్దంటున్నప్పుడు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోతున్నామని కన్నాపూర్ ఎంపీటీసీ భాగ్యలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. సభ్యుల సమస్యలను అధికారులు పరిష్కరించాలని జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సమావేశంలో ఎంపీడీవో బషీరొద్దీన్, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, వైస్‌ఎంపీపీ రమేశ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాచాపూర్ సర్పంచ్ రాజయ్య


బిల్లులు రావడంలేదని ఆరోపిస్తున్న సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి

క్లుప్తంగా

పరిశుభ్రతపై అవగాహన


విద్యార్థులతో మాట్లాడుతున్న వినత

మానకొండూర్: మండలంలోని దేవంపల్లి గురుకుల పాఠశాలను డెప్యూటీ డీఎంహెచ్‌వో వినత సందర్శించారు. విద్యార్థులు కొద్ది రోజులుగా జ్వరం బారినపడుతున్నారని తెలియడంతో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం వైరల్ ఫీవర్, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, సబ్ యూనిట్ ఆఫీస్ అధికారి అంజగౌడ్, డాక్టర్ బియాబాని, స్టాఫ్‌నర్స్ సుజాత, ఏఎన్‌ఎం విజయలక్ష్మి, ఎజాస్, ఆశా సుమలత, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కవితను బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేయాలి

చొప్పదండి: ఎమ్మెల్సీ కవితను బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేసి సీఎం కేసీఆర్ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మినారాయణ ప్రశ్నించారు. అత్యున్నత పదవిలో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించకుండా లిక్కర్ స్కామ్ ఆరోపణలతో ఢిల్లీలో తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారని విమర్శించారు. బీఆర్‌ఎస్ నేతల దందాలను ప్రజలు గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని, మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్యకు ఓ న్యాయం, కవితకో న్యాయమా అని అన్నారు.

ఎన్‌ఎంఎస్‌లో మెరిసిన విద్యార్థులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎన్‌ఎంఎస్(నేషనల్ మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్‌షిప్)కు ఎంపికయ్యారని హెచ్‌ఎం అంజయ్య తెలిపారు. ఎంపికైన విద్యార్థులు అంజిల్, అఖిల్ తేజ, బి.హర్షవర్ధన్, ఈ.వైష్ణవి, ఎన్. చందన, జె. పద్మినిని సర్పంచ్ నేరేళ్ల మహేందర్‌గౌడ్, ఎంపీపీ రాణి సురేందర్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ అభినందించారు.

మహిళలకు సన్మానం


నుస్తులాపూర్‌లో మహిళలను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్

తిమ్మాపూర్: స్త్రీ లేనిదే ప్రపంచం లేదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్ అన్నారు. అన్నిరంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు ముందుకు దూసుకెళ్తున్నారని అన్నారు. మండలంలోని నుస్తులాపూర్, అలుగునూర్ లో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మహిళా సంఘం సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎంలకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సల్ల శారద, జాప శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలను ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలు

కరీంనగర్: మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందని మేయర్ సునీల్‌రావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో భాగంగా నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో గురువారం మహిళా ఉద్యోగులు, సిబ్బంది, మెప్మా సిబ్బందికి నిర్వహించిన ముగ్గులు, మెహందీ పోటీలను ప్రారంభించారు. విజేతలను ఎంపిక చేసి శాలువాతో సత్కరించారు. డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

బూత్ స్థాయి సమావేశాలను విజయవంతం చేయాలి

కరీంనగర్‌టౌన్: బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే బూత్ శక్తి కరణ్ అభియాన్ సమావేశాలను విజయవంతం చేయాలని పార్టీ కరీంనగర్ నియోజకవర్గ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ అన్నారు. గురువారం బీజేపీ కార్యాలయంలో పశ్చిమ జోన్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి అధ్యక్షతన సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం నుంచి బూత్ స్థాయిలో శక్తికరణ్ సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని, ఇందులో నియోజకవర్గంలోని అన్ని బూత్ స్థాయిలో సమావేశాలు నిర్వహించి సంబంధిత కమిటీలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ రాపర్తి విజయ, నాయకులు జాడి బాల్‌రెడ్డి, కోమళ ఆంజనేయులు, శివరామకృష్ణ, మామిడి చైతన్య రమేశ్, చిట్టారెడ్డి లక్ష్మణరావు, జానపట్ల స్వామి, సిద్ధి సంపత్, ఎడమ సత్యనారాయణ రెడ్డి, బాలు, గుంజేటి శివకుమార్, తిప్పర్తి బ్రహ్మం, ఖచ్చు మధు, రవి, గోపాల్, రమేశ్, లక్ష్మీ రాజ్యం, నరేశ్, మాధవరెడ్డి, తిరుమలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్‌కు ఏర్పాట్లు చేయాలి

కరీంనగర్‌కల్చరల్: పవిత్ర రంజాన్ మాసం పండుగకు ఏర్పాట్లు చేయాలని కోరుతూ గురువారం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు జమీలొద్దీన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కర్ణన్, సీపీ సుబ్బరాయుడులకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు.కలెక్టర్ స్పందిస్తూ సోమవారం సాయంత్రం సమావేశం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినట్లు జమీలొద్దీన్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ ఇర్ఫాన్ ఉల్ హక్, ఎండీ ఫక్రొద్దీన్, ఎండీ అన్సారి అహ్మద్, షేక్ యూసూఫ్, ఎండీ సాబీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

రేపు పుస్తకావిష్కరణ

కరీంనగర్‌కల్చరల్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో కవి, ఉపాధ్యాయుడు కూకట్ల తిరుపతి రాసిన 'జల్లెడ' ఎన్నీల ముచ్చట్ల సమీక్షా వ్యాసాల పుస్తకావిష్కరణ–అంకితోత్సవం శనివారం ఫిలింభవన్‌లో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు కందుకూరి అంజయ్య, సీవీ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా తమిళ కవి, కలెక్టర్ తండ్రి జననేసన్ రాజగోపాల వీరరాఘవన్ హాజరవుతారని, పుస్తక స్వీకర్తగా డాక్టర్ నలిమెల భాస్కర్, అతిథులుగా గాజోజు నాగభూషణం, నగునూరి శేఖర్, అన్నవరం దేవేందర్ పాల్గొంటారని, బూర్ల వేంకటేశ్వర్లు పుస్తక పరిచయం చేస్తారని పేర్కొన్నారు. కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి


జమ్మికుంట: కళ్లద్దాలు అందిస్తున్న రాజేశ్వర్‌రావు



శంకరపట్నం: శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీటీసీ లత, రామడుగు: షానగర్‌లో ఎంపీపీ కవిత..

రామడుగు: మండలంలోని షానగర్‌లో గురువారం రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ కలిగేటి కవితలక్ష్మణ్ ప్రారంభించారు. కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపసర్పంచ్ వెంకటనర్సయ్య, వైద్యాధికారి సత్యనారాయణ, సిబ్బంది పవన్,మహేశ్, సునీత, ప్రమీల పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని లింగాపూర్‌లో ఎంపీటీసీ లత కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. సర్పంచ్ వీరారెడ్డి,ఉపసర్పంచ్ సంజీవ్, డైరెక్టర్ కృష్ణారెడ్డి, వైద్యులు కీర్తన, సంతోష్, నందన్, ఏఎన్‌ఎం పద్మ, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్మికుంట: కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. మున్సిపల్ పరిధిలోని 29, 30 వార్డుల్లో శిబిరాన్ని ప్రారంభించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదల కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని పేర్కొన్నారు. కౌన్సిలర్లు రాయికంటి రాజు, మద్ది లావణ్యసంపత్, శ్రీపతి నరేశ్, దయ్యాల శ్రీనివాస్, డాక్టర్ సనా జవేరియా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శంకర్‌రెడ్డి, ఆటోమేట్రిస్ట్ అమరేందర్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది నరేందర్, రజిత, రాధ, ఆశా, సీఎల్‌ఆర్‌పీ, ఆర్‌పీ తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని గునుకులపల్లెలో సర్పంచ్ గునుకుల అమూల్యమధుసూదన్‌రెడ్డి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. మెడికల్ ఆఫీసర్ ధర్మనాయక్ మాట్లాడుతూ.. కంటి వెలుగు విజయవంతంగా కొనసాగుతుందన్నారు. చిగురుమామిడి సింగిల్‌విండో వైస్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ పోచయ్య మెడికల్ ఆఫీసర్ నిర్మల, సూపర్‌వైజర్ హేమలత, ఏఎన్‌ఎంలు కవిత, రాజేశ్వరి, మాలతి, ఆశా వర్కర్లు గ్రామస్తులున్నారు.


చిగురుమామిడి: గునుకులపల్లెలో..

అభివృద్ధిలో దేశానికి ఆదర్శం

చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్

రామడుగు: మండల కేంద్రంలో గురువారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ 60 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని, పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజుకుమార్, ఎంపీడీవో రాజీవ్‌మల్హోత్రా, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణంలోని పదోవార్డులో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గురువారం పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైతే అధికారులు ఇంటింటా సర్వే చేయాలని సూచించారు. వైద్య సిబ్బంది ద్వారా క్యాంపు వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, కమిషనర్ శాంతికుమార్, సీహెచ్‌వో ప్రసాద్, మాదూరి శ్రీనివాస్, కొత్తూరి స్వతంత్ర భారతి, నరేశ్, ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

ప్రజాస్వామ్యం ఖూనీ

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తున్న బీజేపీకి రోజులు దగ్గర పడ్డాయని మండిపడ్డారు. ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై బీజేపీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని, అవినీతికి పాల్పడే బీజేపీ నాయకులను ఎందుకు ఉపేక్షిస్తున్నారని ప్రశ్నించారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

మానకొండూర్ ఎమ్మెల్యే బాలకిషన్

తిమ్మాపూర్: బీఆర్‌ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, మా బలం.. బలగం కార్యకర్తలే అందరూ పార్టీ కుటుంబ సభ్యులేనని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. తిమ్మాపూర్ మండలం (కరీంనగర్ కార్పొరేషన్ పరిధి) అల్గునూర్ 8వ డివిజన్‌లో తొలిపొద్దు కార్యక్రమంలో భాగంగా గురువారం పర్యటించారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో పార్టీ కార్యకర్త గుర్రాల కష్టారెడ్డి మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ తరఫున రూ.2 లక్షల బీమా చెక్కు అందించారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి అందజేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రావుల రమేష్, కార్పొరేటర్ సల్ల శారద, దేవేందర్ రెడ్డి, స్వామిరెడ్డి, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలి

మానకొండూర్: విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. స్పోర్ట్స్ డే సందర్భంగా క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బహుమతులు అందజేశారు. విద్యార్థులు తల్లితండ్రుల కలలు నిజం చేయాలని సూచించారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులని, చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ ఉజ్వల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ప్రిన్సిపాల్ ఆంజనేయరావు, నాయకులు పిట్టల మధు, అధ్యాపకులు పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలకిషన్

ఆధ్యాత్మికం

వైభవంగా శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు


గోపాల్‌రావుపేటలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్తులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేటలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలను మౌనస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా పూజ కార్యక్రమాలు చేశారు. కల్యాణోత్సవంలో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎంపీపీ కలిగేటి కవితలక్ష్మణ్, ఎంపీడీవో రాజీవ్‌మల్హోత్రా, ఎంపీటీసీ మండల సంఘం అధ్యక్షులు ఎడవెల్లి నరేందర్ రెడ్డి, ఎంపీటీసీ ఎడవెల్లి కరుణశ్రీపాపిరెడ్డి, సర్పంచ్ కర్ర సత్యప్రసన్నరెడ్డి, ఉపసర్పంచ్ మహిపాల్ రెడ్డి దేవాలయాభివృద్ధి కమిటీ చైర్మన్ నార్ల రమేష్, పలు గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

జమ్మికుంట: మండలంలోని తనుగుల గ్రామంలో పురాతన స్వయంభూ హనుమాన్ దేవాలయం జీర్ణోద్ధరణ కార్యక్రమంలో భాగంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. వేధపండితులు వేద మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేశారు. దేవాలయంలో శ్రీ సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మహా అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాతలు సంజీవరావు, సత్యప్రియ (ఎన్‌ఆర్‌ఐ) దంపతులు, సర్పంచ్ చిలుముల వసంతరామస్వామి, జెన్‌కో డైరెక్టర్ టీఆర్‌కేరావు, రామకిషన్‌రావు, జితేందర్‌రావు, చింతపల్లి పురుషోత్తమరావు, భూదాత జక్కే రాధమ్మ కుటుంబ సభ్యులు, ఆయా గ్రామాల భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని వల్భాపూర్ గ్రామంలో శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు శ్రీధరాచార్యుల ఆధ్వర్యంలో వైభవంగా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎక్కటి రఘుపాల్‌రెడ్డి, కామిడి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీపతిరెడ్డి, పోరెడ్డి తిరుపతిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి పలువురు ఉన్నారు.

చొప్పదండి: పట్టణంలోని సాయినగర్‌లో గురువారం సాయిబాబా ఆలయంలో విగ్రహ ఆవిష్కరణ వైభవంగా నిర్వహించారు. నూతన సాయిబాబా ఆలయంలో సాయిబాబా, గణపతి, దత్తాత్రేయ విగ్రహాల ఆవిష్కరణ, రుత్వికులు యాగశాలలో పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ పూజల్లో పాల్గొన్నారు. సాయి భజనమండలి సభ్యులు భజనలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ గుర్రం హన్మంత రెడ్డి, ట్రస్టు నిర్వాహక సభ్యుడు దండె లింగయ్య, దూస రాము, పూజారి శ్యాంకుమార్ పూజల్లో పాల్గొన్నారు. ట్రస్టు సభ్యులు, పట్టణ ప్రజలు భారీ సంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

కొలిమికుంట గ్రామంలో...

మండలంలోని కొలిమికుంట గ్రామంలో ఈశ్వర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్మించే పోచమ్మ గుడి పునర్నిర్మాణానికి సర్పంచ్ తాళ్లపల్లి సుజాత గురువారం భూమిపూజ చేశారు. తాళ్లపల్లి జనమ్మ జ్ఞాపకార్థం కుమారులు గుడి నిర్మాణానికి ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తోట కోటేశ్, ఉప సర్పంచ్ సత్తు తిరుపతి, చొక్కాళ్ల కనుకయ్య, సత్తు నర్సయ్య, రమేశ్, సురేశ్, మల్లయ్య, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.


జమ్మికుంట: తనుగులలో శ్రీసీతారాముల కల్యాణం


చొప్పదండి: సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భక్తులు




ఎస్సారెస్పీ నీటివిడుదల

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామ శివారులో పంటలు ఎండిపోకుండా ఎస్సారెస్పీ నీటిని విడుదల చేశామని డీఈ కవిత తెలిపారు. సిబ్బందితో పాటు ఓ రైతు డీబీఎం-11 కాలువలోకి దిగి షట్టర్‌కు మరమ్మతులు చేశారు. రైతుల పంటలు ఎండిపోకుండా వారబంధీ ముగిసినా ఎస్సారెస్పీ నీటిని విడుదల చేశామని పేర్కొన్నారు.

అంత్యోదయ సర్వే పూర్తి చేయాలి

కరీంనగర్‌రూరల్: గ్రామాల్లో చేపట్టిన మిషన్ అంత్యోదయ సర్వేను పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య అన్నారు. గురువారం కరీంనగర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో కరీంనగర్ డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలకు అంత్యోదయపై నిర్వహించిన ప్రత్యేక శిక్షణా తరగతులకు హాజరై మాట్లాడారు. మొత్తం 21శాఖలకు సంబంధించిన వివరాలతోపాటు 206 ప్రశ్నలకు అవసరమైన రికార్డులను పంచాయతీ కార్యదర్శులు పరిశీలించాలన్నారు. నాలుగైదు గ్రామాలు కలిపి ఒకే రెవెన్యూ గ్రామంగా ఉన్నప్పటికీ ఆయా గ్రామాలకు సంబంధించిన భూముల వివరాలను అక్కడే చూపించాలని సూచించారు. గ్రామకంఠం భూముల రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈనెలాఖరులోపు వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. కంపోస్టు షెడ్లను సమర్థవంతంగా నిర్వహించి పంచాయతీలకు ఆదాయం వచ్చేలా సేంద్రియ ఎరువులను తయారు చేయాలని సూచించారు. అనంతరం 21 శాఖలకు చెందిన రికార్డుల తయారీ, ప్రశ్నలకు సంబంధించిన నివేదికలను తయారు చేయడంపై కార్యదర్శులకు శిక్షకుడు ప్రసాద్ అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో డీఎల్‌పీవో హరికిషన్, ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డితో పాటు పలువురు ఎంపీవోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీపీవో వీరబుచ్చయ్య